www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
కర్నూలు, నంద్యాల జిల్లా
వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# కొత్తూరు సుబ్బరాయుని హుండీ ఆదాయం 12.38 లక్షలు



**పాణ్యం,మార్చి26.అక్షర టైమ్స్:-** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు నంద్యాల డివిజన్ దేవాదాయశాఖ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి పర్యవేక్షణలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ లెక్కింపు వల్ల 12 లక్షల 38వేల 825 రూపాయలు నగదు, 523 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. ఈ లెక్కింపు గత ఫిబ్రవరి 5వ తేదీ నుండి మార్చి 26వతేది వరకు ఈ ఆదాయం సమకూరినదని ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, బీరం శివరామిరెడ్డి, అర్చకులు నారాయణస్వామి, సురేష్ శర్మ, బ్యాంక్ అధికారులు, ఏఎస్ఐ రఫీ, పిసి వెంకటేశ్వరరావు, బాలాజీ సేవా సంస్థ, తిరుమల బాలాజీ సేవా సంస్థ అధ్యక్షులు శివయ్య, సీతారామిరెడ్డి సంస్థల సభ్యులు, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో కబ్జాలు, రౌడియిజం చేస్తే సహించను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి



**ఆదోని,మార్చి26.అక్షర టైమ్స్:-** ఆదోని పట్టణంస్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గురువారం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈసందర్భంగా తాగునీటి కొరత, రహదారుల దుస్థితి, పింఛన్ సమస్యలు పై అర్జీలు సమర్పించారు. నియోజకవర్గ ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులకు సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజాదర్బార్ లో వచ్చిన సమస్యలుఎక్కువ శాతం భూ సమస్యలు కబ్జాలు ,రౌడీయిజం ,ఇంటి పట్టాల కోరకు లాంటి సమస్యలు రావడంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూకబ్జాలు చేసి ప్రజలను పీడించుకుని తిన్న పాపం పండి ఎన్నికల్లో ఓడిపోయి ఇంట్లో కూర్చున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంకా ఇప్పుడు కూడా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఇలాంటి కార్యక్రమాలు చేయాలని చూస్తే సహించేది లేదని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పలు శాఖల అధికారులు,మునిసిపల్ కమీషనర్,ఎంపీడీఓ, ఎంఈఓ అధికారులు , కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ బెట్టింగ్ అక్రమ కార్యకలాపంలో దొరికిన 4 మంది నిందితులు అరెస్ట్

**- రూ.17,98,500/- నగదు మరియు 4 సెల్ ఫోన్లు స్వాధీనం**

**కడప/పట్టణం,మార్చి26.అక్షర టైమ్స్:** క్రికెట్ బెట్టింగ్ అక్రమ కార్యకలాపంలో దొరికిన 4 మంది నిందితులు అరెస్ట్ రూ.17,98,500/- నగదు మరియు 4 సెల్ ఫోన్లు స్వాధీనం అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు సంక కల్యాణ్, వయసు 36 సంవత్సరాలు, తండ్రి రమణయ్య, డోర్ నం.88/223-1, అంగడి వీధి, కడప నగరం ఎల్లటూరు ప్రదీప్, వయసు 26 సంవత్సరాలు, తండ్రి పగడాలయ్య, డోర్ నం.97/90, అంగడి వీధి.కడప నగరం కొడిదెల రహమత్ వల్లి, వయసు 19 సంవత్సరాలు, తండ్రి కే. బాషా, డోర్ నం.90/78, అంగడి వీధి, కడప నగరం దొంతల రాహుల్ రెడ్డి, వయసు 26 సంవత్సరాలు, తండ్రి డి. లక్ష్మీ రెడ్డి, డోర్ నం.1/1255-9, ఎర్రముక్కపల్లి, కడప నగరం స్వాధీనం చేసుకొన్న వస్తువులు మరియు వాటి వివరాలు మొత్తం రూ.17,98,500/- నగదు మరియు 4 సెల్ ఫోన్లు కేసుసంక్షిప్తవివరాలు కడప ఎస్పీ ఆదేశాల మేరకు, కడప డి.ఎస్.పి ప్రత్యక్ష పర్యవేక్షణలో అక్రమ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్న వ్యక్తుల కదలికలపై కఠిన నిఘా ఏర్పాటు చేయబడింది. ఆ క్రమంలో 26.03.2026 నాడు ఇన్స్పెక్టర్ శ్రీ టి. రెడ్డెప్ప , ఎస్సై మహమ్మద్ రఫీ ఏఎస్ఐ పి. వెంకటేశ్వర్లు మరియు ఇతర సిబ్బంది భగత్ సింగ్ పార్క్ సమీపంలోని సంగం ఫంక్షన్ హాల్ వద్దకు వెళ్లి పై పేర్కొన్న నిందితులను అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుండి రూ.17,98,500/- నగదు మరియు నేరానికి వినియోగించిన 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో కొంతమంది నిందితులు అక్కడి నుండి పరారయ్యారు. వారిని త్వరలోనే పట్టుకునే చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్పీ కడప ప్రశంస ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన ఇన్స్పెక్టర్ టి. రెడ్డెప్ప , ఎస్సై మహమ్మద్ రఫీ,మరియు ఇతర సిబ్బందిని కడప ఎస్పీ అభినందించారు.



# ఎల్పీజీ స్థానంలో పిఎన్జి వినియోగం తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ డా"శ్రీధర్ చెరుకూరి**





**కడప/నగరం,మార్చి26.అక్షరటైమ్స్:** పీఎన్జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఉన్న వారు కచ్చితంగా ఎల్పీజీకి బదులుగా పీఎన్జీ వినియోగానికి బదిలీ కావాలని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వినియోగదారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. సివిల్ సప్లయ్ శాఖ ఆధ్వర్యంలో.. ఎల్పీజీ గ్యాస్ కు ప్రత్యామ్నాయంగా కడప జిల్లాలో అందుబాటులో ఉన్న పీఎన్జీ వినియోగంపై అవగాహన పెంచేందుకు కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధీమీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో వంట గ్యాస్ కొరత కొనసాగుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పీఎన్జీ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఉన్న వారు కచ్చితంగా మారిపోవాల్సి ఉంటుంది. వారందరికీ అతి త్వరలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా ఆగిపోనుందనే విషయాన్ని కూడా తెలియజేసారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్లో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిన సంగతి తెలిసిందేనని.. ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నా కూడా ఈ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పైప్డ్ నేచురల్ గ్యాస్ (గ్రిడ్+) అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని కుటుంబాలకు ఎల్పీజీ గ్యాస్ డెలివరీని నిలిపివేయనున్నట్లు తెలిపింది. పీఎన్జీ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఆ కనెక్షన్కు మారాలని స్పష్టం చేసిందన్నారు. అందుకు కొంత సమయం కూడా గడువు ఇస్తున్నట్లు స్పష్టం చేసిందన్నారు. ప్రస్తుతం ఏర్పడిన వంట గ్యాస్ కొరతను అధిగమించేందుకు పీఎన్జీని ప్రోత్సహించాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. ఈ మేరకు నిత్యావసరాల చట్టం కింద కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ మంగళవారమే ఉత్తర్వులు జారీ చేసింది. పీఎన్జీకి మారడం ద్వారా గ్యాస్ సిలిండర్ల రీఫిల్స్ బుకింగ్ చేసే అవసరం తొలగిపోతుంది. అలాగే 24 గంటలు ఇంటికి గ్యాస్ సరఫరా కొనసాగుతుంది. మరోవైపు ప్రస్తుత పరిస్థితుల్లో పీఎన్జీకి మారేవారికి చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. అయితే, ఏదైనా టెక్నికల్ ఇష్యూ వల్ల ఇంటికి పైపు లైన్ కనెక్షన్ ఇవ్వడం సాధ్యం కాకపోతే అలాంటి సందర్భంలో మాత్రమే ఎల్పీజీ సరఫరా కొనసాగుతుందని పెట్రోలియం శాఖ తెలిపింది. అయితే, పీఎన్జీ గ్యాస్ కంపెనీ నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుందని స్పష్టం చేసిందన్నారు.పిఎన్జి వినియోగదారులకు ప్రస్తుతం ఎల్పీజీ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్ల సదుపాయం కూడా వర్తిస్తుందని తెలిపారు. కాగా జిల్లాలోని ప్రతి పారిశ్రామిక యూనిట్లలో అన్ని రకాల భద్రతల దృశ్య ఎల్పిజికి బదులుగా పిఎన్జి ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో పిఎన్జి వాడకం భద్రత కూడిన లాభదాయకమైన వనరుగా ప్రాచుర్యంలోకి వస్తుందన్నారు.ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లో కూడా ఎల్పీజీ కంటే పిఎన్జి వాడకమే అత్యధికంగా ఉందన్నారు. ప్రస్తుతం కడప నగరంలోని అన్ని గృహ అవసరాలకు తప్పనిసరిగా పిఎన్జిని ఉపయోగించుకునే విధంగా నగరపాలక సంస్థ అన్ని వార్డు సచివాలయాల పరిధిలో వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం ఎల్పిజి కొరత నేపథ్యంలో పిఎన్జి కనెక్షన్ లో ఎలాంటి అభ్యంతరాలను, ఆంక్షలు విధించాల్సిన అవసరం లేదని సూచించారు. కడప నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రకాష్ నగర్, ఓం శాంతి నగర్, ఎర్రముక్కపల్లె, పటేల్ రోడ్, రెడ్డి కాలనీ, ఎన్జీఓ కాలనీ, పకీరపల్లే, బుద్ధ టౌన్షిప్, ద్వారకానగర్, రాజీవ్ పార్క్ ఏరియా, మారుతీనగర్, చిన్న చౌక్, వీటితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో.. థింక్ గ్యాస్ కంపెనీ వారు పైప్ ద్వారా గ్యాస్ సరఫరా చేయుటకు దాదాపు 30,000 గృహలకు ఇన్ స్టాలేషన్ చేసేందుకు ప్రక్రియ చేపడుతున్నారన్నారు. ఇప్పటికే 10,000 గృహాలకు పైప్స్, మీటర్ అమర్చడం జరిగిందని ఇప్పటికే 3000 గృహలకు పైగా నిరంతరాయంగా పీఎన్ జి గ్యాస్ కూడా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జేసీ డా"నిధి మీనా మాట్లాడుతూ..జిల్లాలోని అన్ని పారిశ్రామిక యూనిట్లలో ఆరెంజ్ రెడ్ జోన్లలో ఉన్న యూనిట్లు తప్పనిసరిగా పిఎన్జి వాడకాన్ని అమలు చేయాలని సూచించారు ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక జీవోను కూడా విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో గ్యాస్ కంపెనీ జిల్లా మేనేజర్ విజయ్ మోహన్ పీఎన్జీ వాడకం, ఉపయోగాలు, ప్రభుత్వం కల్పించే రాయితీలు, లాభాలు మొదలైన అంశాలను పిపిటి ద్వారా వివరించగా.. పలువురు హోటల్స్ యాజమాన్య కమిటీ వారు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. పిఎన్జి గ్యాస్ ముఖ్య ప్రయోజనాలు.ఖర్చు తగ్గించే ఇంధనం24ఇ7 నిరంతర సరఫరా, మీటర్ ద్వారా పారదర్శక వినియోగం, సిలిండర్ బుకింగ్ అవసరం లేకుండా సౌకర్యవంతమైన సేవ,గాలి కంటే తేలికగా ఉండటం వల్ల లీకేజ్ ప్రమాదం తక్కువ, పర్యావరణానికి అనుకూలమైన శుభ్రమైన ఇంధనం స్మార్ట్ గ్యాస్ మీటర్ ధరను రూ.9,000 నుండి రూ.6,000కు (33% తగ్గింపు.పిఎన్జి గ్యాస్ గీజర్ ఇన్స్టాలేషన్పై రూ.2,000 క్యాష్బ్యాక్.పరిమితి కాలం పాటు మాత్రమే అందుబాటులో ఉన్న ఆఫర్.ఎల్పీజీ తో పోల్చితే పిఎన్జి ప్రయోజనాలు.పిఎన్జి గ్యాస్ వినియోగం ఎల్పీజీ తో పోల్చితే తక్కువ ఖర్చుతో పాటు, అధిక భద్రత మరియు నిరంతర సరఫరాను అందిస్తుంది.ఎల్పీజీ లో సిలిండర్ బుకింగ్, స్టాక్ సమస్యలు, మరియు లీకేజ్ ప్రమాదాలు పిఎన్జి లో ఉండవు. గృహావసరాలతో పాటుగా కమర్షియల్ హోటల్ కి, వాణిజ్య అవసరాల పారిశ్రామిక పారిశ్రామిక అవసరాలకి ఇదివరకే పైప్లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయడం జరుగుతుంది అన్నారు. టోల్ ఫ్రీ: 1800 2021 999, 9010926528 ఈ కార్యక్రమంలో కేఎంసి కమోషనర్ రాకేష్ చంద్రం, డీఎస్ఓ రఘురాం, పరిశ్రమల శాఖ, పొల్యూ6కంట్రోల్ బోర్డు, సివిల్ సప్లై, సంబందిత శాఖల అధికారులు, హోటల్స్, పరిశ్రమలు తదితర కమర్షియల్ సంస్థల నిర్వహకులు పాల్గొన్నారు.

# చల్లగిరిగేల పుణ్యక్షేత్రం ఒక ఆధ్యాత్మిక శిఖరం రచయిత బోల్లు రామమహన్



**పోరుమామిళ్ల,మార్చి26.అక్షర టైమ్స్:-** కడపజిల్లా పోరుమామిళ్ల మండలంలోని చల్లగిరిగెల కోదండ రామస్వామి దేవస్థానం కడప గడ్డకు కీర్తి పతాకం పోరుమామిళ్లకు మణిమకుటం ఆధ్యాత్మికతకు నిలువుటద్దం అపూర్వ శిల్పకళా వైభవం జనమేజయుని సంకల్ప బలమై. 11వ శతాబ్ది నిర్మాణ కౌశలమై. చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిన చారిత్రక నేపథ్యం ఈ క్షేత్రం అజరామరమై వెలుగుతున్న అద్భుత ఆధ్యాత్మిక నిలయం. చలువలు కురిసే 'చల్లగిరి'పై కొలువైన పుణ్యధామం. రమ్య వన ఫలపుష్పశోభితం. సీతమ్మ దివ్యమంగళ రూపం సుదర్శన చక్రధారియై, పద్మాసనస్థుడై. యోగముద్రలో వెలిగే శ్రీరాముని విలక్షణ రూపం కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షం.దక్షిణాభిముఖుడై కొలువైన 'శ్రీ పట్టాభిరాముని' దివ్య తేజం! చేత ధనుస్సు ధరించి.. భక్తుల రక్షణ వలయమై నిలిచిన లక్ష్మణమూర్తి హస్తాన తాళపత్ర గ్రంథాలను బూని.. విద్యుచ్ఛక్తికి, జ్ఞానానికి ప్రతీకగా నిలిచిన ఆంజనేయ స్వామి! సమస్త జనులకు రక్షగా నిలిచే ఈ క్షేత్రం.. భక్తికి పరాకాష్ట అన్నారు.

# శ్రీ శాంతినికేతన్ హైస్కూల్ నందు అంగరంగ వైభవంగా ముందస్తు శ్రీరామ నవమి వేడుకలు






**పుల్లంపేట,మార్చి26.అక్షర టైమ్స్:-** శ్రీ శాంతినికేతన్ హై స్కూల్ నందు రేపు జరగబోయే శ్రీరామ నవమి జయంతిని పురస్కరించుకొని ముందస్తుగా శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించాము. ఈ కార్యక్రమంలో స్కూల్ చిన్నారులు రాముడు, లక్ష్మణుడు, సీత మరియు హనుమంతు వేషధారణలతో అందరినీ ఆకర్షించి ఆనందింపచేశారు. మరియు విద్యార్థులు శ్రీరాముని పాటలతో కోలాటం వేశారు, మరియు టీచర్లు శ్రీ రాముని భక్తి పాటలు పాడి అందరినీ భక్తి సముద్రంలో ముంచి వేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులైన మనోహర్ రెడ్డి, జయసింహ మణికంఠ, రవి ప్రకాష్ రాజు, బాలాజీ, భరత్, వర్షిత్ మరియు నరేంద్ర పాల్గొని శ్రీరాముని జన్మదిన విశిష్టతను సంపూర్ణంగా వివరించారు. కరెస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీరాముడు తండ్రి దశరథమహారాజు మాటకు విలువనిస్తూ సతిసమేతంగా 14 సంవత్సరాలు అరణ్యవాసం చేశాడు అని వివరిస్తూ పిల్లలందరూ తల్లిదండ్రుల మాటను విని వారిని గౌరవిస్తూ ముందుకు సాగాలని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాముని చిత్రపటానికి పూలతో పూజా కార్యక్రమం నిర్వహించి అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతూ వడపప్పు, పానకం పంచిపెట్టారు. ఈ కార్యక్రమం నందు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ ఆనందోత్సాహంతో పాల్గొని దిగ్విజయంగా శ్రీరామనవమి ని జరుపుకున్నారు.

# అకాల వర్షాల కారణంగా నష్టపోయిన అరటి తోటలను పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చిన ముక్కా రూపానంద రెడ్డి





**ఓబుళవారిపల్లి,మార్చి26.అక్షర టైమ్స్:-** ఓబులువారిపల్లి మండలం, వై.కోట పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన అరటి తోటలను రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ మరియు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంట నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. వర్షాల వల్ల ఎదురైన ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, రైతులకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని తెలిపారు. అవసరమైన సహాయం త్వరగా అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎన్డిఎ కూటమి నేతలు పాల్గొన్నారు.

# మూరుకూటి సులోచనమ్మ కు ఘన నివాళి అర్పించిన

**మాజీ శాసన సభ్యురాలు విజయమ్మ**

**బద్వేల్ ఇంచార్జ్ రితీష్ రెడ్డి**





**పోరుమామిళ్ల,మార్చి26.అక్షర టైమ్స్:-** అవధూత కాశినాయన మండల పార్టీ టిడిపి అధ్యక్షులు ఎన్ రాజ మనోహర్ రెడ్డి భార్య సులోచనమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో ఇన్చార్జ్ రితేష్ రెడ్డి పాల్గొని నివాళులర్పించారు . శ్రీ అవధూత కాశినాయన మండల పార్టీ అధ్యక్షులు, మా కుటుంబ ఆప్తులు మురుకూటి రాజమనోహర్ రెడ్డి (రాజారెడ్డి) ధర్మపత్ని సులోచనమ్మ పెద్ద కర్మ కార్యక్రమంలో ఈరోజు నా మాతృమూర్తి కే.విజయమ్మ తో కలిసి పాల్గొన్నాను. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, శోకతప్త హృదయంతో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్ , ఎల్.ఎస్.పి డ్యామ్ చైర్మన్ ఈగ రమణారెడ్డి, రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సాధనకారి రంతూ , డీసీసీబీ డైరెక్టర్ యరసాల కృష్ణారెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు పాపుదీప్ మల్లికార్జున రెడ్డి . రామచంద్రారెడ్డి , రంగసముద్రం పంచాయతీ ఎంపీటీసీ కలవకూరి రమణ , మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవికుమార్ రెడ్డి , కాశినాయన మండలం సొసైటీ అధ్యక్షుడు బంగారు రెడ్డి ,లక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి రోహిత్ రెడ్డి ఎన్టీఆర్ సుధాకర్ రెడ్డి , రామ సుబ్బారెడ్డి, పోలి రెడ్డి , నరసింహారెడ్డి , కోడిగుడ్లపాడు సర్పంచ్ సోమేశుల బాల గురయ్యా , అమర్నాథ్ రెడ్డి, గోడి రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సులోచనమ్మ గారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నా అన్నారు.

# యర్రగుంటలో 27 నుండి 31 వరకు అత్యంత వైభవంగా శ్రీరామనవమి వేడుకలు..

**- శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం**

**- సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం**

**- అజానుబాహు మరవింద దళాయతాక్షం**

**- రామం నిశాచర వినాశకరం నమామి**




**శిరివెళ్ల,మార్చి26.అక్షర టైమ్స్:-** మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో గల శ్రీరామ స్వామి దేవస్థానంలో మార్చి 27 శుక్రవారం నుండి మార్చి 30 వరకు శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవం గా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మరియు గ్రామ పెద్దలు తెలియజేశారు. 27న సీతారాముల కళ్యాణం. 28న హనుమద్వాహనము. 29న గరుడోత్సవం 30న రథోత్సవం 31న పాన్పు సేవ తదితర పూజా కార్యక్రమాలతో పాటు ఉత్సవ సేవా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీతారాముల కళ్యాణ వేడుకలను తిలకించేందుకు విచ్చేయుచున్న భక్తులందరికీ 27న మధ్యాహ్నం ఉచిత అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. 29న గరుడొస్తవం సందర్భంగా గొప్ప కళాకారులచే గొప్ప కోలాట నృత్య ప్రదర్శన ఉంటుందని అలాగే 30 న సాయంత్రం రథోత్సవం సందర్భంగా ఉర్రుతలూగించే రాయలసీమ చెక్కభజన కార్యక్రమం ఉంటుందని 31న పాన్పు సేవతో శ్రీరామనవమి వేడుకలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలియజేశారు.

# ముస్తాబవుతున్న శ్రీ రామాలయం







**- సీతారాముల కళ్యాణానికి భారీ ఏర్పాట్లు చేసిన డిప్యూటీ కమిషనర్ కె.వాణి**

**ఆదోని,మార్చి26.అక్షర టైమ్స్:-** ఆదోని మండలం పరిధిలో పెద్ద తుంబలం గ్రామంలో శ్రీ రామాలయం నిర్వహించుచున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ముస్తాబవుతోంది.ఆలయ పరిసరాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించ బడుతూ భక్తులను ఆ కట్టు కుట్టున్నాయి.ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం డిప్యూట్ కమిషనర్ కార్యనిర్వాణ అధికారి కె. వాణి మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహ, ఈరన్న స్వామి వార్ల దేవస్థానం, ఉరుకుంద వారి దత్తత శ్రీ రామాలయం నందు స్వస్తిశ్రీ చాంద్రమాన పరాభవా నామ సంవత్సరం చైత్రశుద్ధి నవమి తేదీ మార్చ్ 27 న శుక్రవారం పునర్వసు నక్షత్ర యుక్త శుభ పుష్కరాంశము నందు సాయంకాలం గం" 5-30 ని॥ నుండి గం"7-26 ని" వరకు శ్రీరామచంద్రుల శ్రీ సీతాదేవి వార్ల కళ్యాణ మహోత్సవం "లోక కళ్యాణార్థం "అత్యంత శోభాయమానముగా నిర్వహించబడును. కళ్యాణ మహోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తూ వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు ప్రసాదము కూర్చునే సౌకర్యాలు కల్పించామని తెలిపారు.శ్రీ సీతారాముల కల్యాణాన్ని శాస్త్రంక్తంగా నిర్వహించేందుకు పండితులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు హోమాలు ప్రారంభమై, మధ్యాహ్నం ప్రధాన కళ్యాణ కార్యక్రమం నిర్వహించన్నారు.ఈ కార్యక్రమానికి విశేష కార్యక్రమం నందు ఆశేష గ్రామ ప్రజలు, భక్తాదులు పరిసర గ్రామస్తులు విరివిగా పాల్గొని.కళ్యాణమును తిలకించి.శ్రీ స్వామి వార్ల ప్రసాదమునుస్వీకరించి. శ్రీ సీతారాముల వారి దివ్య ఆశీస్సులు పొంది తరిశీతురుగలరని తెలిపారు.

# జాతీయస్థాయి దివ్యాంగ క్రీడా విజేతకు సత్కారం

**- షాట్ పుట్ లో జాతీయస్థాయిలో రజత (సిల్వర్ మెడల్) పతకం సాధించిన గౌతమ్**

**- అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడానికి జాతీయ స్థాయి కోచింగ్ కు ఎంపికైన గౌతమ్**

**- సత్కరించిన నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్**

**- దివ్యాంగ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం: డాక్టర్ రవి కృష్ణ**




**నంద్యాల,మార్చి26.అక్షర టైమ్స్:-** ఈనెల 18వ తేదీ నుండి 21వ తేదీ భువనేశ్వర్ లో ఉన్న కళింగ స్టేడియంలో జరిగిన 24వ జాతీయ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తరపున పాల్గొన్న నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన గౌతమ్ షాట్ పుట్ క్రీడా విభాగంలో సిల్వర్ మెడల్ (రజత పతకం) సాధించిన సందర్భంగా గురువారం స్థానిక నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో, నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌతమ్ ను శాలువా, బహుమతులతో ఘనంగా సత్కరించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ సుధాకర్ రెడ్డి పాల్గొని గౌతమ్ ను అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ, సోమేశుల నాగరాజు మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు గౌతమ్ గత నెల నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొని రజత పతకం సాధించడం ప్రశంసనీయమన్నారు. అంతర్జాతీయ పోటీలలో దేశం తరపున పాల్గొనడానికి బెంగళూరులో ఉన్నతస్థాయి శిక్షణ కోసం గౌతమ్ ఎంపిక కావడం విశేషం అన్నారు. గౌతమ్ అంతర్జాతీయ దివ్యాంగ క్రీడలలో దేశానికి పతకం సాధించి భారత దేశానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. క్రీడలలో ఆసక్తి ఉన్న దివ్యాంగులు దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంప్రదిస్తే తగిన విధంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ సుధాకర రెడ్డి, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణయ్య, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చంద్రమోహన్, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నయ్య, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మేడం చంద్రశేఖర్, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు పాల్గొన్నారు.

# బొమ్మలసత్రంలో అగ్నిప్రమాదం 7 గడ్డివాములు దగ్ధం

**- బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి**





**నంద్యాల,మార్చి26.అక్షర టైమ్స్:-** నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం బలిజపేటలో విషాదం చోటుచేసుకుంది. పశువుల దాణా కోసం నిల్వ ఉంచిన 7 గడ్డివాములు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి వెంటనే స్పందించారు. ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించిన ఆయన, బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం బాధితులకు తన వంతు సాయంగా 35 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, కష్టపడి పశువుల కోసం నిల్వ చేసుకున్న దాణా ఇలా కాలిబూడిదవ్వడం అత్యంత దురదృష్టకరమన్నారు.బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, బాధితులను తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అగ్నిప్రమాదం వెనుక ఏవైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. స్థానిక వైసీపీ నాయకులు అశోక్ కుమార్ రెడ్డి, మాధవరెడ్డిలు ముందుకు వచ్చి పశువులకు అవసరమైన దాణా అందిస్తామని హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దస్తగిరి, ఆర్టీసీ భాస్కర్ రెడ్డి, అనంతలక్ష్మి, శంకర్రెడ్డి, జాకీర్, సాయిరాంరెడ్డి, కత్తినజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సహాయ సేవా కేంద్రం ప్రారంభించిన జమాఆతె ఇస్లామి

**- ఏపిలో ఓట్ల గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే, సేవా కేంద్రం సద్వినియోగం చేసుకోండి : సమద్**




**నంద్యాల,మార్చి26.అక్షర టైమ్స్:-** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణా లేదా స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ సవరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏప్రేల్ నుండి అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం తరుపున ప్రస్తుతానికి ఈ ప్రక్రియపై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పించలేదు. సర్ ఓటు సవరణకు 2002 సంవత్సరం ప్రమాణికంగా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సామాన్య ప్రజానీకం, పేద, నిరాక్షస్యత వల్ల ఓటర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జమాఆతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ తన వంతుగా ప్రజలకు అవగాహన కల్గించే 2002 ఓటర్ లిస్టులో తమ ఓటు గుర్తించి ప్రిజినీ చేయించుటకు సహాయం చేస్తుంది. ఈ నేపథ్యంలో నంద్యాల అంటి కోట మస్జిద్ లో సహాయక కేంద్రాన్ని స్థానిక జేబహెచ్ అధ్యక్షులు అబ్దుల్ సమద్ లాంఛనంగా ప్రారంభించారు. ముస్తాఖ్ అహ్మద్, సాజిద్ హుసేన్, ఆరీఫ్, అహమ్మద్ యువకులు తమ ల్యాప్ ట్యాప్ లో ఇంటి నెం, ఓటర్ ఐడి ద్వారా ఓటర్ల లిస్టు లో పేర్లు గుర్తిస్తున్నారు. తద్వారా స్థానిక బూత్ లెవెల్ ఆఫీసర్ (బియల్ఓ) కు మ్యాపింగ్ లో సులభతరం అవుతుంది. ఈ సంధర్భంగా సమద్ మాట్లాడుతు తమ సమయం వెచ్చించిన యువతకు అభినందిస్తు, ఆదివారం వరకు కొనసాగే 'సర్' ఓటు సవరణలో ప్రజలు సేవలు పొందవచ్చని ఆహ్వానించారు. మొదటి రోజు మూడొందల మంది తమ సేవలు సద్వినియోగం చేసుకోవడం శుభసూచకం అన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ జిల్లా బాధ్యులు హాఫీజ్ జమాన్, సి. యం. జకరియా, ఇమాం హాఫీజ్ హబీబుల్లాహ్, అబ్బాస్ అలీ, అబ్దుల్ రషీద్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏది తల్లీ గట్టుంటది నాటి సాహిత్యం

## ఏదీ ఎక్కడా కానరావేం మన దగ్గరనే కాదు

పొరుగునే అని కూడా కాదు, మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా ఆ ఉధృతి తగ్గింది. వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితమవుతున్న కవిత్వమే తప్ప సామాజిక పట్టింపు ఎక్కడా కానరాదేం. ముఖ్యంగా మహిళలు రాసే కవిత్వం ప్రేమ రాహిత్యం, వ్యక్తిగత వైఫల్యాలపై వస్తున్నాయే తప్ప సామాజిక, సామూహిక వైఫల్యాలపై ఎందుకు నిరసన కవిత్వం రావడం లేదు. ఆనాటి ఆవేశం నేడు ఎక్కడా కానరావడం లేదేం? ఆనాడు వచ్చిన ఫెమినిస్ట్ కవిత్వం నేడు ఎందుకు రావడం లేదు? ఆనాటి ఫెమినిస్ట్‌లు తమ తర్వాత తరానికి ఆ ఆయుధాలను ఇవ్వలేకపోవడమా లేక ఈనాటి కవయిత్రులు ఆ తరాన్ని అందుకోలేకపోవడమా అసలు కారణమేంటి? ఒకరిద్దరు మినహా మిగిలిన కవయిత్రులంతా తమ కవిత్వాన్ని వ్యక్తిగతానికే పరిమితం చేస్తున్నారు. ఆ రోజులతో పోలిస్తే నేడు కవిత్వ ప్రకటనలకు అనేకానేక వేదికలున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో కవిత్వం ఏరులై పారుతున్నది. నిజానికి పత్రికలు కవిత్వానికి ఇస్తున్న స్పేస్ చాలా అంటే చాలా తగ్గిపోయింది. కొన్ని పత్రికలైతే అసలు సాహిత్యం ఓ ఆలంబన అనే విషయాన్నే వదిలేసి ఏండ్లు గడిచిపోయాయి. మిగిలిన సామాజిక మాధ్యమాల్లో కూడా సామాజిక అంశాలపై కవిత్వం రాస్తున్న వారు పెద్దగా కానరావడం లేదు. 80, 90వ దశకాల్లో మహిళలు రాసిన కవిత్వం చదివి చాలామంది ప్రేరణ పొందారు. ఆ కవిత్వాల ద్వారానే కొన్ని ఉద్యమాలు వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నీలిమేఘాలు కవిత్వ సంపుటి తీసుకొచ్చిన తుఫాను.. అలాంటి ఇలాంటి తుఫాను కాదు. అంతవరకూ వ్యక్తులుగా ఉన్న కవయిత్రులంతా ఆ నీలిమేఘాలు అనంతరం సామూహికం అయ్యారు. అందులో ఒక్కో కవితా ఒక్కో తూటాలా మహిళలను కదిలించింది. పురుషులైతే ఇలా ఉన్నామా ఇలా బతుకుతున్నామా? అని తమని తాము ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చింది. అప్పటికింకా చదువు, సంధ్యల్లో గడుపుతున్న నాలాంటి వాళ్లకు నీలిమేఘాలు ఓ సంచలన, సంభ్రమాశ్చర్య కవిత్వ సంపుటి. ఆ సమయంలో ఓల్గా, విమల, జయప్రభ, ఘంటశాల నిర్మల, మందరపు హైమవతి, కొండేపూడి నిర్మల వంటి వారి కవిత్వం చదివి ఉప్పొంగిపోయిన సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో. ఆ కవయిత్రుల్లో కొందరు పూర్తిగా కవిత్వానికి దూరమయ్యారు. మిగిలినవారు రాస్తున్నా ఆ నాటి వాడి, వేడి ఎందుకు తగ్గిందో? మహిళలందరూ.. 'ఎవరి బతుకులు వారివే. మనకెందుకు ఇదంతా' అనే ఓ నిర్లిప్త వాతావరణంలోకి వెళ్లిపోయారా? సామూహికంగా మారి ఓ ఉద్యమ స్థాయిలో కవిత్వాన్ని పండించినవారంతా ఇప్పుడు ఒక్కరుగానే మిగిలిపోతున్నారా? అప్పట్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. దానికి తోడు సమాజంలో ఓ చిన్నచూపు. కానీ, నేడు పరిస్థితులు కొంత మారాయి. ముఖ్యంగా దేశంలో గ్లోబలైజేషన్ కారణంగా వచ్చిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. ఐటీ ప్రవేశంతో జీవితాలు మారిపోయాయి. స్త్రీలకు తాము చదివిన చదువులకు తగ్గట్టుగా ఉద్యోగాలు వచ్చాయి. ఆర్థిక స్వావలంబన పెరిగింది. పురుషుడితో



సమానంగా తానూ ఎదిగాననే ఆత్మవిశ్వాసం వచ్చింది. లక్షల్లో జీతాలతో పాటు తన కోర్కెలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశాలు వచ్చాయి. దీని ప్రభావం సాహిత్యం మీద పడిందా? ఇవన్నీ ప్రశ్నలే. జీవితం సంతృప్త స్థాయికి చేరిందనుకోవాలా? అందుకే వ్యక్తిగత వ్యవహారాలకే నేటి కవయిత్రులు పరిమితమవుతున్నారని భావించాలా? ఇదంతా కావచ్చు కానీ నా మటుకు నాకు అనిపించింది ఏమిటంటే.. ఓ కేంద్రీకృత ఉద్యమం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. అసలు ఉద్యమం అనేదే లేకుండాపోయింది. కథకుడు ఖదీర్‌బాబు చెప్పినట్టు 'కనీసం ఊళ్లు పట్టుకు ఊరేగడానికి ఉద్యమమూ లేదు' అన్నట్టుగా మారింది. అమ్మ నవలలో 'పావెల్ చేత మన ఆలోచనలన్నింటికీ కేంద్రం ఉద్యమమే కావాలి' అని మాక్సిం గోర్కీ చెప్పిస్తాడు.

# ఫ్యాషన్ రంగవల్లిక బంజారా అల్లిక



దుస్తులంటే నాగరికత. ఆ దుస్తులే అస్తిత్వ పతాకలు. రంగులే అభిరుచుల వ్యక్తీకరణ. ఆహార్యమే గుర్తింపు, గౌరవం, వారసత్వం. అవన్నీ కోల్పోతే పరాయీకరణే. రంగురంగుల హంగులు ఉండే వస్త్రశ్రేణితో అలరించిన నిన్నటి తరం బంజారాలు.. కాల ప్రవాహంలో తమ ఆహార్యాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో గతించిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమే కాదు.. ఆ బంజారాల వస్త్ర సౌందర్యాన్ని ఆధునిక దుస్తులకు ఆపాదిస్తున్నది బంజారా కసూతి సంస్థ. లంబాడీ మహిళలను ఆత్మన్యూనత నుంచి ఆత్మగౌరవం వైపు నడిపిస్తున్నది. తెలంగాణలో లంబాడీలు ఉన్నట్టే.. కర్ణాటకలోనూ ఉన్నారు. వీరిని లంబానీలు అని పిలుస్తారు. ప్రాంతం వేరైనా వీరి కట్టూ, బొట్టూ ఒకేలా ఉంటుంది. విజయపుర ప్రాంతంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందినవాళ్లు అధిక సంఖ్యలో ఉంటారు. ఇక్కడి మహిళలు చూపు తిప్పుకోలేనంత అందమైన దుస్తులు, ఆభరణాలను నిండుగా ధరించేవారు. ఒకప్పుడు వీరి ఆహార్యం చూడగానే బంజారాలని గుర్తుపట్టేవాళ్లు. కానీ, ఇప్పుడు తలపై నుంచి జారుతూ ఉండే అద్దాల అంచుల టుక్రీ మెరుపులు లేవు. సంప్రదాయ గాగ్రీ (లెహంగా) కూడా ధరించట్లేదు. కాంక్లీ (రవిక లాంటిది), దాని పైనుంచి వేసుకునే ఆభరణాలు కూడా దాదాపు కనుమరుగయ్యాయి. గాగ్రీ బదులు చీర కట్టుకుంటున్నారు. ఒకప్పుడు వస్త్రధారణ వల్ల ప్రత్యేకంగా కనిపించే ఈ బంజారా బిడ్డలు సాధారణ ప్రజల్లో కలిసిపోయారు. అందరిలా ఉండాలన్న కోరిక వాళ్లకు లేదు. సంప్రదాయ వస్త్రధారణ పట్ల ప్రేమ తప్ప వ్యతిరేకత లేదు. వారసత్వ కళ మీద మమకారమే కానీ ఛీత్కారం లేదు. వారికి లేనిదల్లా ఉపాధే! డబ్బే అన్నిటినీ శాసిస్తున్న ఈ కాలంలో వారి జీవన సౌందర్యం కనుమరుగైపోయింది.

# మనసు.. కవిత్వం



కట్టుబాట్లను వదిలేసినప్పుడు సంతోషంగా ఉన్నా, తర్వాత సమాజం నుంచి వచ్చే విమర్శల వల్ల దుఃఖమూ కలుగుతుంది. మనసు ఒక్కోసారి ఆకాశంలో విహరిస్తున్నట్టుగా, ఒక్కోసారి దుఃఖపడుతూ, ఒక్కోసారి నిస్తేజంగానూ, నిరుత్సాహంగానూ ఉంటుంది. మన మనసు ఎలా ఉంటే, ఆ భావం ముఖంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఒక మనిషి చెడ్డవాడా, మంచివాడా అనే నిర్ణయం మనసును బట్టే ఉంటుంది. అందుకే, ఎందరో వాగ్గేయకారులు, గేయ రచయితలు ఎంతో అనుభవంతో, మనసును సంబోధిస్తూ రచనలు చేశారు. భారతీయ సంగీతంలో, వివిధ సాహిత్య రీతుల్లో మనసును సంబోధిస్తూ అనేక రచనలు చోటుచేసుకున్నాయి. మనసుకు ఒక రూపం అంటూ లేదు. కానీ, మన ఇంద్రియాలకు మాత్రం అధికారి మనస్సే. మనం ఏ పనిచేసినా, అది మనసుతో ముడిపడి ఉంటుంది. మనిషి పురోగతికి, తిరోగతికీ మనసే కారణం. అందుకే అది స్వేచ్ఛగా తిరగాలని, కట్టుబాట్లను వదిలేయాలని చూస్తుంది. మనసు, దాని స్వరూప స్వభావాలు, జీవితంలో ఎదురయ్యే వివిధ సందర్భాల్లో మనసు తీరుతెన్నులు ఎలా ఉంటాయో అనుభవపూర్వక రచనల సాహిత్యాలను పరిశీలించి తెలుసుకుం దాం. భారతీయ సంగీతంలో మనసును సంబోధిస్తూ వెలువడిన వివిధ రీతులైన శాస్త్రీయ, భక్తి, లలిత, జానపద, చలనచిత్ర సంగీతాలు ఎలా ఉన్నాయో, ఆయా రచనల భావం, ఆ రచనల్లో గల సాహిత్య విలువలను ఒకసారి సింహావలోకనం చేద్దాం.

### మొదటగా శాస్త్రీయ సంగీతం...

సామవేద జనితమైన శాస్త్రీయ సంగీతం హిందుస్తా నీ, కర్ణాటక సంగీత బాణీలుగా ఉన్నది. వీటిలో కర్ణాటక సంగీతం, మన దక్షిణ భారతానికి చెందిన ది. ఈ సంగీత రీతిలో మనసు మీద రచనలు ఎక్కువగా తెలుగులో తర్వాత సంస్కృతం, హిందీ, తమి ళం, కన్నడం వంటి ప్రాంతీయ భాషల్లో వచ్చాయి. 18వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారులైన త్యాగ య్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు కర్ణాటక సం గీతానికి త్రిమూర్తులు. వీరికృతులు, కీర్తనలు, రచనలు, నేటి శాస్త్రీయ సంగీతం అనేంతగా సంగీత ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. ఈ ముగ్గురిలో త్యాగరాజ స్వామి రచనలు అప్పటి సామాజిక పరిస్థితులకు దగ్గరగా ఉం డటం వల్ల విశేష ఆదరణ పొందాయి. త్యాగరాజు రామభక్తుడు. వూంఛవృత్తి చేస్తూ జీవనం గడిపేవాడు. ఐహిక సుఖములను వదిలి రాముని పరబ్రహ్మగా భావించి నాదోపాసన ద్వారా తరించాడు. ఆయన కృతులలో మనసును సంబోధిస్తూ, మనసుకు వివిధ విషయాల గురించి బోధిస్తూ సాగే రచనలుఎక్కువగా ఉన్నాయి. 'మనసా ఎటులోర్తునే, నా మనవిని చేకొనవే/ దినకరకుల భూషణుని' అంటూ మనసును చెడు స్నేహాలు చేయకుండా, తరింపజేసే మార్గం తెలుపమంటూ వేడుకుంటున్నట్టుగా సాగుతుందీ పాట. 'అలాగే, ఉండేది రాముడొకడు/ ఊరక చెడిపోకే మనసా/ ధర్మాత్ముడు, సర్వసముడు క్షేమకరుడు త్యాగరాజ చిత్తహితుడు/ జగము నిండి' అనే ఈ కీర్తనలో సగుణ రూపుడైన రాముడికి, నిర్గుణమైన పరబ్రహ్మ తత్వాన్ని ఆపాదించి మనసుకు బోధించడం కనపడుతుంది. ఈ కీర్తన 28వ మేళకర్త హరి కాంభోజి రాగంలో ఉన్నది. ఈ రచనలు శాస్త్రీయ సంగీతంలో మచ్చు తునకలు.

### భక్తి సంగీతంలో..

మన భారతీయ జీవనశైలిలో దేవునిపై భక్తి చాలా ఉంటుంది. అయితే, మనిషి ఏ మార్గంలో నడవాలన్నా దానికి మనసు సహకరించాల్సిందే. చిన్నప్పటి నుంచి రామభక్తుడైన త్యాగయ్య 'మనసు స్వాధీనమైన/ ఆ ఘనునికి/ మరి మంత్రతంత్రములేల?' అన్నాడు. అంటే, మనసు సహకారం మనిషికి ఎంత ప్రధానమైనదో దీని ద్వారా తెలుస్తున్నది.

### రామదాసు కీర్తనల్లో!

తెలుగునాట భజనల్లో తప్పకుండా వినవచ్చేవి రామదాసు కీర్తనలు. కంచర్ల గోపన్న తన భక్తి రచనల ద్వారా భక్త రామదాసుగా పేరుగాంచారు. అయితే రామదాసు తన మనసుకు, కేవలం రామునిపై భక్తి, వైరాగ్యాలనే కాకుండా, సామాజిక బాధ్యతను కూడా బోధించాడు. 'శ్రీరాముల దివ్య నామ స్మరణ చేయుచున్న చాలు ఘోరమైన తపములను / కోరనేటికే మనసా భాగవతుల పాదజలము/ పైన చల్లుకొన్న చాలు భగీరథికి పోయ్యేననే భ్రాంతి ఏటికే ' అంటూ ఒక చరణంలో, మరో చరణంలో సామాజిక బాధ్యతగా%ొ% 'పరుల హింస చేయకున్న /పరమ ధర్మమంతె చాలు/ పరుల రక్షింతునని/పల్క నేటికే దొరకాని పరుల ధనముల దోచక ఉండితె చాలు గురుతుగాను గోపురము, కట్టనేటికే మనసా' అంటూ ఘోరమైన తపస్సులు చేయవలసిన అవసరం లేదని, మహాభక్తుల పాద జలము చాలు, గంగానది వద్దకు వెళ్లనవసరం లేదనీ చాలా చక్కగా చెప్పారు. అలాగే పరాయివాళ్ల ధనం మీద ఆశపడి వాటిని దోచి పేరు రావడానికి గుడి గోపురాలు కట్టించినా నిష్ఫలమని సామాజికపరంగా అందరికీ కనువిప్పు కలిగించే విధంగా కీర్తనలు చేశారు. మనసుకీ, మనిషికీ మార్గనిర్దేశనం చేయగల ఈ కీర్తన, సాహిత్యపరంగా రామదాసుచే కావించబడిన ఒక గొప్ప మానస సంబోధన.

### లలిత సంగీతం...

గ్రామ ఫోన్ రికార్డులు, రేడియోల ద్వారా జనంలోకి చేరిన సంగీత రీతి లలిత సంగీతం. శాస్త్రీయ సంగీతానికి భిన్నంగా నూతనంగా ఉండే ఈ లలితగీతాలు సంగీతం, ప్రకృతి, ప్రేమా, భక్తి వైరాగ్యం దాకా స్పృశించని అంశం లేదు. శాస్త్రీయ సంగీతంలోని కృతుల లాగా పాండిత్యమే ప్రధానంగా కాకుండా, సాహిత్య రస భావానుగుణమైన రాగ రచనతో ఆధునిక గేయ రచనలను పాడే సంగీతం తొలి రోజుల్లో గీతావళి అని, ఆ తర్వాత లలిత సంగీతం అనీ వాడుకలోకి వచ్చింది. లలిత సంగీత లక్షణాన్ని బాలాంతరపు రజనీకాంతరావు ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర రెండవ భాగంలో చెప్పారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బసవరాజు అప్పారావు, నండూరి వెం కట సుబ్బారావు, బాపిరాజు, బాలాంతపు రజనీకాంతరావు వంటి రచయితలు.. విశ్వనాథ, సాలూరి రాజేశ్వరరావు, చిత్తరంజన్ వంటి స్వరకర్తలు.. ఘంటసాల, బాలమురళికృష్ణ, బాల సరస్వతి, అనసూయ, సుశీల, శ్రీరంగం గోపాలరత్నం వంటి గాయక శిఖామణులు లలిత సంగీతానికి పరిపుష్టిని చేకూర్చారు. మల్లవరపు విశ్వేశ్వర రావు రచించిన ఒక మానస బోధగేయం%ొ% 'మరపురాని కలలు కని, మరుదినమ్ము మేలుకొని నిరాశలే/ మిగులునని తెలుసుకొంటివా మనసా/ అలసి యుంటివా మనసా ప్రేమ నిన్న రోజుదని/ నేడు కరిగిపోయెననీ/ వేదనయే రేపటనీ తెల్ల మాయెనా! గుండెలు తల్లడిల్లెనా! మనసా! అలసటా యెనా మనసా!' అంటూ ప్రేమలో విఫలమైనప్పుడు మనసు పడే బాధను చక్కగా వివరిస్తుంది. ఒకరిపై ప్రేమ కలగాలన్నా లేదా ఏ విధమైన భావన కలగాలన్నా మనసుదే కీలకపాత్ర. కనుక ఈ గీతంలో ప్రేమ విఫలమైనప్పుడు కలిగే బాధను మనసే పడుతున్నట్టు భావించి కవి ఈ గీతాన్ని రాశారు. అలాగే కృష్ణశాస్త్రి కూడా 'ఒదిగిన మనసున, పొదిగిన భావం' అన్న లలితగీతానికి ఈమని శంకరశాస్త్రి సంగీతం సమకూర్చారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar,Tadipatri -515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,AnantapurDistrict,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com